క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకం



శ్రీనివాసనాయక్, అత్తార్ జావీద్, దిల్కాబాషా



ఈశ్వర్‌నాయక్

కోవెలకుంట్ల: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో బనగానపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురిని నియమిస్తూ మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది. రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీగా కోవెలకుంట్లకు చెందిన కాండ్లావత్ శ్రీనివాసనాయక్, సెక్రటరీగా బనగానపల్లె చిన్నరాజుపాలెంకు చెందిన ఈశ్వర్‌నాయక్.. ముస్లిం మైనార్టీ జనరల్ సెక్రటరీగా కోవెలకుంట్లకు చెందిన అత్తార్ జావీద్, సెక్రటరీగా దిల్కాబాషాను నియమించారు.

విత్తనశుద్ధి తప్పనిసరి



రంగాపురంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో

బేతంచెర్ల: రైతులు పంటల సాగుకు ముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని ఏఓ విజయకుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం, అంబాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్‌లో విత్తనాల సాగు, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. పంటల సాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. ఏఈఓ మహమ్మద్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సూచనలు పాటిస్తే మంచి ఫలితాలు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

బనగానపల్లె: పంటల సాగులో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం యాగంటిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పలు పథకాలపై అవగాహన కల్పించారు. వివిధ పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు.

సొంత నిధులతో షెడ్డు ఏర్పాటు



ఎంపీపీ పాఠశాలలో దాత ఏర్పాటు చేసిన షెడ్డు

బనగానపల్లె రూరల్: నందవరం ఊరవాకిలి సమీపంలోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులు భోజనం చేసేందుకు ఇదే గ్రామానికి చెందిన పాణ్యం గోపాల్‌రెడ్డి తన సొంత నిధులు రూ.70వేలతో షెడ్డును నిర్మించినట్లు స్కూల్ హెచ్‌ఎం విజయ శేఖర్ మంగళవారం తెలిపారు. విద్యార్థులు ఇబ్బందులు పడుతుండడంతో హెచ్‌ఎం అభ్యర్థన మేరకు కీశేలు చిన్న ఈశ్వర్‌రెడ్డి కుమారుడు గోపాల్‌రెడ్డి స్పందించినట్లు చెప్పారు. దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ తిరుపాలు

బేతంచెర్ల: విద్యార్థులు, మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్‌ఐ తిరుపాలు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో డోన్ శక్తి టీమ్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, ప్రమాదాలపై ప్రొజెక్టర్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ స్నేహపూర్వక వాతావరణంలో జీవనం సాగించాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి చర్యలు



కూలిన ప్రహరీని పరిశీలిస్తున్న చైర్మన్ రాజేష్

డోన్: స్థానిక చిగురుమానుపేటలోని క్రిస్టియన్ శ్మశాన వాటిక ప్రహరీని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌ను ఆదేశించారు. ఇటీవల శ్మశాన వాటిక ప్రహరీ కూలిపోయిన విషయాన్ని సమైక్య క్రిస్టియన్ కమిటీ పెద్దలు శామేల్, చిట్టంబాబు, భాస్కర్, జర్మియా, జాకబ్‌పాల్, మోటరాముడు చైర్మన్ దృష్టికి తీసుకురాగా, మంగళవారం చైర్మన్ రాజేష్‌తో పాటు కమిషనర్ ప్రసాద్‌గౌడ్, వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

బీమా.. లేదిక ధీమా

- కూటమి ప్రభుత్వంలో నిలిచిన పథకం
- రెట్టింపు సాయం చేస్తామని ఎన్నికల సమయంలో హామీ
- ఏడాదిగా బాధిత కుటుంబాల ఎదురుచూపు
- గత ప్రభుత్వంలో క్రమం తప్పకుండా సాయం అందజేత

పేద, మధ్యతరగతి కుటుంబానికి చెందిన కుటుంబ యాజమాని చనిపోతే ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని అందించింది. ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.5 లక్షలు, సహజ మరణం పొందితే రూ. లక్ష సాయం అందించి బాధితులను ఆదుకుంది. దీంతో బాధిత కుటుంబ బతుకు దెరువు ముందుకు సాగేది. ఎవరైన చనిపోయారని తెలిసిన వెంటనే సచివాలయ సిబ్బంది బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి బీమా పథకం క్లయిమ్ కోసం ఆన్‌లైన్ చేసేవారు. 21 రోజుల్లో నామినీకి బీమా సొమ్ము వారి బ్యాంకు ఖాతాలో జమచేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ పథకంపై నిర్లక్ష్యం చూపుతోంది. ఏడాదైనా పథకం అమలుకు విధివిధానాలు ప్రకటించలేదు.

కొలిమిగుండ్ల: సంక్షేమ పథకాల అమలును కూటమి సర్కారు గాలికొదిలేసింది. కనీసం బీమా పథకమైనా అమలు చేస్తే కాస్త భరోసా ఉంటుందని పేదలు భావించారు. గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ బీమాను అమలు చేశారు. సవ్యంగా సాగుతున్న ఈ పథకం సార్వత్రిక ఎన్నికల తర్వాత కుంటుపడింది. పథకం పేరును చంద్రన్న బీమాగా మార్చి అమలును మాత్రం వదిలేశారు. దీంతో సహజ మరణంతోపాటు ప్రమాదవశాత్తూ మరణించిన కుటుంబాలు పరిహారం కోసం ఎదురుచూస్తున్నాయి. అసలు బీమా పథకం ఇస్తారా? ఎత్తేస్తారా? అనే అనుమానాలు వ్యక్తవుతున్నాయి.

దిక్కుతోచని స్థితిలో బాధిత కుటుంబాలు

బీమా సౌకర్యం లేకపోవడంతో ఎన్నో బాధిత కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. ఎన్నికల సమయంలో కూటమి నేతలు తాము అధికారంలోకి వస్తే చంద్రన్న బీమా అమలు చేసి ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు అందజేస్తామని ప్రకటించారు. ఇప్పటి వరకు ఈపథకానికి చెందిన వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడం శోచనీయం. బనగానపల్లె నియోజకవర్గంలో నాపరాతి గనులు, పాలీష్ ఫ్యాక్టరీలు అధికంగా ఉన్నాయి. గనుల్లో వెలికితీసిన నాపరాళ్లను ఎక్కువ భాగం ట్రాక్టర్లలో రవాణ సాగిస్తుంటారు. నాపరాతి పరిశ్రమపై ఆధారపడి దాదాపుగా 40వేల మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారు.

దినదిన గండం

ప్రమాదకరమైన నాపరాతి గనులు, పాలీష్ ఫ్యాక్టరీలు, రాళ్లను ట్రాక్టర్లలో రవాణ చేసే సమయంలో కార్మికుల పరిస్థితి దినదిన గండంగా ఉంటుంది. ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందో తెలియదు. గనుల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకోవడం, మృతి చెందిన, తీవ్రంగా గాయపడిన ఘటనలు ఉన్నాయి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కార్మికుల కుటుంబాలకు భరోసా ఇచ్చే బీమా లేకపోవడంతో రోడ్డున పడుతున్నారు.



నాపరాతి గనిలో పని చేస్తున్న కార్మికులు

పేరు మార్పుతో సరి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటి వరకు ఉన్న వైఎస్సార్ బీమా పథకం స్థానంలో చంద్రన్న బీమాగా పేరు మార్చారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలు ఇస్తామని బాహాటంగా ప్రకటించినా నేటికి అమలుకు నోచుకోలేదు. నియోజకవర్గ వ్యాప్తంగా గనులతో పాటు రోడ్డు ప్రమాదాల బారిన పడి చాలా మంది మృత్యువాత పడ్డారు. ఇప్పటి వరకు మృతి చెందిన కుటుంబాల నుంచి క్లైయిమ్స్ సేకరించేందుకు మార్గదర్శకాలు విడుదల చేయలేదు. ఎప్పుడు ఓపెన్ అవుతుందా అని బాధితులు సచివాలయాల చుట్టు తిరుగుతున్నారు. ఒక వేళ వెబ్‌సైట్ తెరుచుకున్నా ఎలాంటి మెలిక పెడుతారోనని ఆందోళన చెందుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో భరోసా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు వైఎస్సార్ బీమా భరోసా కల్పించింది. 18–50 ఏళ్ల లోపు వ్యక్తులు సహజ మరణం చెందితే రూ. లక్ష నామినీకి అందించేవారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన వారికి రూ. 5 లక్షల చొప్పున బాధిత కుటుంబ సభ్యుల బ్యాంక్ ఖాతాలో జమచేసి ఆపదలో ఆదుకుంది అప్పటి ప్రభుత్వం. ఎవరైనా మృతి చెందితే సచివాలయ ఉద్యోగులు వారి ఇళ్ల వద్దకే వెళ్లి తక్షణ సాయంగా రూ.10 వేలు అందించేవారు. బీపీఎల్ కుటుంబాలకు చెందిన వారు అర్హులు కావడంతో ప్రభుత్వమే పూర్తి ప్రీమియం చెల్లించింది. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం, ఇన్సూరెన్స్ కంపెనీలు సహకరించకపోయినా పూర్తిగా ఈ పథకాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అమలు చేసింది.

ఎప్పుడేం జరుగుతుందో తెలియదు



గనిలో పనిచేసే సమయంలో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలియదు. పనిచేసే సమయంలో రాళ్లు విరిగి మీద పడుతుంటాయి. కోత మిషన్ వద్ద జాగ్రత్తగా లేకపోతే ఇబ్బంది పడాల్సి వస్తుంది. పనిచేసే సమయంలో కార్మికులు చాలా మంది మృతి చెందారు. ప్రమాద బీమా ఉంటే కుటుంబాలకు అండగా ఉంటుంది.

–రామచంద్రుడు, కార్మికుడు

చంద్రన్న బీమా అమలు చేయాలి



ఈ ప్రాంతంలో నాపరాతి గనులు ఎక్కువగా ఉన్నాయి. వీటి మీద ఆధారపడి కార్మికుల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. పని చేసే సమయంలో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. చంద్రన బీమా పథకం అమలు చేయాలి. త్వరితగతిన మార్గదర్శకాలు రూపొందించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి.

–కంబగిరిస్వామి, హుమన్‌రైట్స్ సభ్యుడు

రాష్ట్రంలో విధ్వంస పాలన

- రెడ్ బుక్ రాజ్యాంగం అమలు
- వైఎస్సార్‌సీపీ కోవెలకుంట్ల నాయకుల విమర్శ
- వెన్నుపోటు పుస్తకావిష్కరణ



కోవెలకుంట్లలో వెన్నుపోటు పుస్తకావిష్కరణ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోవెలకుంట్ల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక, ఆటవిక, అశాంతి పాలన కొనసాగిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బీవీ నాగార్జునరెడ్డి ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని ఆయన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాసనాయక్, యువజన విభాగ మండల అధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు జశ్వంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటు పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను టార్గెట్‌గా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని, శాంతిభద్రతలు క్షీణించాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో విద్య, వైద్య, వ్యవసాయ రంగానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని, ప్రస్తుత కూటమి పాలనలో ఆ రంగాలు నిర్వీర్యమయ్యాయని విమర్శించారు. మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు, వేధింపులు, అన్యాయాలు, అబద్ధాలు, విష ప్రచారాలు, దుర్మార్గాలు, వివక్ష, అంతులేని అవినీతి, ఉన్మాద రాజకీయాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, నెలకు రూ. 3 వేల నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి కింద 18–59 ఏళ్ల మహిళలకు నెలకు రూ. 1500 అందజేస్తామని సూపర్‌సిక్స్ హామీలతోపాటు మరో 143 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినా హామీల అమలు చేయకుండా మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందన్నారు. ఉద్యోగాల నోటిఫికేషన్లు లేక, నిరుద్యోగ భృతి అందక, పారిశ్రామిక రంగం కుంటుపడి యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు లేక విలవిలలాడుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు దశరథ రామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, నాగేశ్వర రెడ్డి, పెద్దిరెడ్డి, మున్నా, షరీఫ్, మధు, సమీర్, అన్వర్, కిషోర్, జనార్ధన్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల హక్కులను కాపాడాలి

- జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి వెంకటశేషాద్రి



భోజనాన్ని తనిఖీ చేస్తున్న వెంకటశేషాద్రి

డోన్ టౌన్: రిమాండ్ ఖైదీల హక్కులను పరిరక్షించాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి అన్నారు. మంగళవారం డోన్‌లోని సబ్ జైలును ఆయన తనిఖీ చేశారు. జైలు పరిసరాలు, భోజనశాలను పరిశీలించి ఖైదీలతో సమావేశమయ్యారు. 70 ఏళ్లు పైబడిన ఖైదీలపై ఆరా తీశారు. వైద్య సేవలు, బెయిల్ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వారి కేసులను త్వరితగతిన పరిష్కరించే విధంగా కోర్టుల దృష్టికి తీసుకెళతామన్నారు. బెయిల్ కోసం న్యాయవాదిని ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థిక స్తోమత లేనివారికి ఉచిత న్యాయ సేవలు అందిస్తామని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జైలు సూపరింటెండెంట్ సురేష్ ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెరుగైన సౌకర్యాలు



విద్యార్థులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న అధ్యాపకులు

బనగానపల్లె రూరల్: బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెరుగైన విద్యా బోధన, సౌకర్యాలు ఉన్నాయని.. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత అన్నారు. మంగళవారం కళాశాల అధ్యాపకులు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కోర్సులు, వసతులపై అవగాహన కల్పించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..కళాశాలలో ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఆధునిక కంప్యూటర్ ల్యాబ్, సైన్స్‌ల్యాబ్, స్కిల్ హబ్, విశాలమైన ఆట స్థలంతో పాటు మరెన్నో సదుపాయలు ఉన్నట్లు వివరించారు. అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని తెలిపారు. అధ్యాపకులు మహమ్మద్‌గౌస్, బాబునాథ్, సూర్యనారాయణరెడ్డి, బడేసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పీ అవినీతిపై ఫిర్యాదు

డోన్: మెప్మా ఆర్‌పీ రమాదేవి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని.. ఆమెపై విచారణ జరపాలని టీచర్స్ కాలనీకి చెందిన మయూరి గ్రూపు పొదుపు సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయం మేనేజర్ ఇమాం హుసేన్‌కు వినతి పత్రం అందజేశారు. పొదుపు డబ్బుల్లో సుమారు రూ.40లక్షలను రెండేళ్ల క్రితం బ్యాంకుకు చెల్లించకుండా రమాదేవి సొంత వ్యాపారాలకు వాడుకున్నారని ఆరోపించారు.

125వ సారి రక్తదానం



ప్రశంసాపత్రం అందుకుంటున్న గోపి

డోన్ టౌన్: పట్టణానికి చెందిన కోలా గోపి 125వ సారి రక్తదానం చేసి గొప్ప మనసు చాటుకున్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం పురస్కరించుకుని కర్నూలులోని లయన్స్ క్లబ్ బ్లడ్ బ్యాంక్‌లో మంగళవారం రక్తదానం చేసి తన 125వ మైలు రాయిని దాటారు. ఈ సందర్భంగా లయన్స్ సంస్థ ప్రశంసాపత్రం అందజేసింది.

కంపచెట్ల తొలగింపు



సచివాలయం వద్ద చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

సంజామల: మండల పరిధిలోని కమలపురి సచివాలయం వద్ద పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, కంపచెట్లను మంగళవారం తొలగించారు. 'నిర్లక్ష్యానికి నిదర్శనం' అనే శీర్షికతో ఈనెల 16న సాక్షిలో వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీరాజ్ ఏఈ పిచ్చిమొక్కల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. త్వరలో సచివాలయాన్ని ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభం

బనగానపల్లె: స్థానిక వాసవీపాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం పాలిసెట్ కౌన్సెలింగ్ సెంటర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుందని.. ఈ అవకాశాన్ని స్థానిక విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటుకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవ చూపడంతో సాధ్యమైందన్నారు.

22న వాల్మీకుల వర్క్‌షాప్

ప్యాపిలి: విజయవాడలోని మహర్షి వాల్మీకి భవన్‌లో ఈ నెల 22న రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు వాల్మీకి బోయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలమద్దిలేటి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ చేపడుతున్న ఈ వర్క్‌షాప్‌నకు వాల్మీకులు తరలిరావాలన్నారు. సమస్యలపై చర్చ ఉంటుందన్నారు.

శబరిమలకు అయ్యప్ప స్వాములు

ప్యాపిలి: పట్టణానికి చెందిన అయ్యప్ప మాలాధారులు విష్ణు, ప్రతాప్‌రెడ్డి, సంతోష్ మంగళవారం శబరిమలకు తరలివెళ్లారు. కొద్ది రోజుల క్రితం మండల దీక్షను చేపట్టిన వారు దీక్షను విరమించేందుకు ఇరుముడితో వాహనంలో శబరిమలకు బయలుదేరారు. ఈ సందర్భంగా స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాములకు వీడ్కోలు పలికేందుకు వారి కుటుంబ సభ్యులు తరలివచ్చారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు

కోవెలకుంట్ల: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి అన్నారు. పట్టణ శివారులోని కోవెలకుంట్ల–నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో కుందూనది వంతెన వద్ద మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, జమ్మలమడుగు, అవుకు, తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్, తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు మృతి

ప్యాపిలి: స్థానిక ఎన్‌హెచ్ 44పై కలచట్ల బ్రిడ్జి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆదిత్య సుబ్రమణి (44) మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌కు చెందిన సుబ్రమణి తన స్నేహితులు 11 మందితో కలసి కొద్ది రోజుల క్రితం ద్విచక్రవాహనాలపై ఊటీకి వెళ్లారు. ఊటీ నుంచి స్వస్థలానికి తిరిగి వస్తుండగా ప్యాపిలి సమీపంలోని కలచట్ల బ్రిడ్జి వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆదిత్య సుబ్రమణిని స్నేహితులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అతడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య ప్రసూన, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ప్యాపిలి పోలీసులు తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన

ప్యాపిలి: రోడ్డు భద్రతా నియమాల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డోన్ ఎంవీఐ క్రాంతి కుమార్ అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. మైనర్‌లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. పిల్లలు ద్విచక్రవాహనాలు నడిపితే వారి తండ్రిపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. అనంతరం పట్టణంలో వాహనాల తనిఖీ చేశారు. గోరక్‌పూర్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న హర్యాణా రాష్ట్రానికి చెందిన ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో పరిమితికి మించి ప్రయాణికులు ఉన్నట్లు గుర్తించి రూ. 14,000 జరిమానా విధించి ప్యాపిలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే రెండు ఆటోలకు రూ. 2000 జరిమానా విధించారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ



తక్కువ సంఖ్యలో హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

బనగానపల్లె రూరల్: స్థానిక పొదుపు భవనంలో ఎంపీపీ మానస వీణ అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సివుండగా కోరం సభ్యులు లేకపోవడంతో అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అనివార్య కారణాలతో హాజరు కాలేదు. అధికారులు కేవలం ఆయా శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, పనుల గురించి సభకు వివరించారు. అయితే ఆర్‌అండ్‌బీశాఖ అధికారులు, మైనర్ ఇరిగేషన్, ఫారెస్టు, మైనింగ్‌శాఖ అధికారులు గైర్హాజరయ్యారు. అలాగే రెవెన్యూశాఖ, డీఆర్‌డీఏ వెలుగు, ఐసీడీఎస్, విద్యాశాఖ మండల స్థాయి అధికారులు రాకుండా కింది స్థాయి ఉద్యోగులు సమావేశానికి హాజరై మమ అనిపించారు. జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీసుబ్బమ్మ, ఎంపీడీఓ వెంకటరమణ, డిప్యూటీ ఎంపీడీఓ సతీష్‌కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయిక్రిష్ణ, పీఆర్ ఏఈ రమణ, పలుకూరు, టంగుటూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు మధు మోనిక, సోహైల్‌బాబు, విద్యుత్ ఏఈలు గర్జప్ప, శ్రీనివాసలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్

డోన్: పేద మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, ఐసీడీఎస్ ముఖ్య అధికారిణి శంషాద్ బేగం అన్నారు. యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక భారత్‌గ్యాస్ కార్యాలయ ఆవరణలో ఈనెల 17 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు 15 రోజుల పాటు మహిళలకు బ్లౌజ్ డిజైనింగ్‌లో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని మంగళవారం వారు ప్రారంభించారు. 25 మంది మహిళలను ఎంపిక చేసి పౌష్టికాహారం తయారీ, వినియోగంతో పాటు బ్లౌజ్ డిజైనింగ్‌లో శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో యాగంటిపల్లె కేవీకే శాస్త్రవేత్త లక్ష్మి, శిక్షకులు నదియా, లల్సు, ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్లు పరమేశ్వరమ్మ, అరుణకుమారి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ, వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: పట్టణంలో వీధి కుక్కల నుంచి పసి పిల్లల ప్రాణాలకు రక్షణ కల్పించాలని వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, జాకీర్ హుసేన్, సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ కోరారు. మంగళవారం నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఆయా పార్టీ నాయకులు, స్థానికులు ధర్నా చేశారు. అనంతరం నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. గత నెల 2వ తేదీ వీధికుక్కల దాడిలో బాలుడు షేక్ మొహిద్దీన్ మృతి చెందినా నగర పంచాయతీ అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. కుక్కలను తరలించకపోవడంతో దుర్గాపేట, బోయపేట, హనుమాన్ నగర్ కాలనీల పిల్లలపై దాడి చేసి గాయపరిచాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని చికెన్, మటన్ దుకాణాల్లోని ఎక్కడపడితే అక్కడ పడేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు కుక్కల దాడిలో గాయపడిన హనుమాన్ నగర్ కాలనీకి చెందిన చిన్నారి ప్రణీత్‌ను పరామర్శించారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్స్ మధు, ఇబ్రహీం, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, ఎద్దులన్న, వలిబాషా, తిరుమలేష్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

మిత్రునికి పూర్వ విద్యార్థుల సాయం



నిత్యావసర సరుకులు అందజేస్తున్న మిత్రులు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల 2000–01 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆపదలో ఉన్న మిత్రునికి అండగా నిలిచారు. బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన రామకృష్ణ కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. అతని పరిస్థితి తెలుసుకున్న పూర్వ విద్యార్థులు స్రుజన్, శ్రీక్షా, గంగాధర్, సలీం, సంజీవ్ తదితరులు 3 నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను మంగళవారం అందజేశారు.

మత్స్యకారులకు నైపుణ్య పరీక్షలు

బనగానపల్లె రూరల్: మత్స్యకారులు ఐకమత్యంగా ఉండాలని మత్స్యసహకార సంఘం జిల్లా చైర్మన్ నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం క్రిష్ణగిరి గ్రామ సమీపంలోని దద్దణాల ప్రాజెక్టు వద్ద మత్స్యకార సహకార సంఘంలో కొత్త సభ్యుల చేర్పు ప్రక్రియలో భాగంగా ఐదు రకాల నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మత్స్యకారుల సామర్థ్యాన్ని గుర్తించడమే కాకుండా అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ రవికుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

కొలిమిగుండ్ల: సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలని సీఐ రమేష్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక లలితా సుందరేశ్వర స్వామి ఆలయంలో బ్రీడ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన, కంటి వైద్య శిబిరాన్ని సీఐ ప్రారంభించారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కర్నూలుకు చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన రక్తదానంలో 50 మంది రక్తం అందించారు. ఐమిత్ర విజన్ సెంటర్ ఆధ్వర్యంలో 180 మందికి కంటి పరీక్షలు చేసి 120 మందికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. బ్రీడ్స్ యూత్ అధ్యక్షుడు రవికుమార్, ఉపాధ్యక్షుడు రామాచారి, సభ్యులు పాల్గొన్నారు.